batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

3 ఆగస్టు 2026
సోమవారం

## తెలంగాణలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు

# కౌంట్‌డౌన్

**ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం**



02

జుక్కల్, బతుకమ్మ :తెలంగాణలో వైద్య విద్యలో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు కీలక ప్రక్రియ ప్రారంభం కానుంది. నీట్ - యూజీ 2026 ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కలిపి మొత్తం 9,550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉండగా, ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఏడాది నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షలో హనుమకొండ జిల్లాకు చెందిన వీరయ్యగారి సహ్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 720 మార్కులకు 705 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 13వ ర్యాంకు, తెలంగాణ రాష్ట్రంలో తొలి ర్యాంకు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.



## నగరంలో భక్తి శ్రద్ధలతో

# ఊర పండుగ

**ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు**

**బారులు తీరిన భక్తులు**

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :నిజామాబాద్ నగరంలో ఊర పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఊర పండుగలో భాగంగా గ్రామదేవతలను ఉదయం నుంచి ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నగరం భక్తితో పులకరించి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామ దేవతలకు నీరాజనాలు పలుకుతూ నగరవాసులు భక్తిశ్రద్ధలతో ఊర పండుగను జరుపుకున్నారు. ఊరంతా చల్లగా చూడు తల్లి అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని వేడుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడి పంటలు  పండాలని సుఖ సంతోషాలతో ఉండాలని దుష్ట శక్తులు దరిచేర వద్దని వేడుకుంటూ నగర ప్రజలు గ్రామ దేవతలను పూజించారు . సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల జాతర రోజునే పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఊర పండగ నిర్వహణ కమిటీ అయిన సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఖిల్లా రఘునాథ్ ఆలయం  శారదాంబా గద్దె వద్ద గ్రామదేవతలను ఉంచి పసుపు కుంకుమ చెవి పోగులు ఆభరణాలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. సర్వ సమాజ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ కార్యదర్శి బంటు రాజేశ్వర్ కన్వీనర్ రామర్తి గంగాధర్ కుల సంఘాల పెద్దలు పూజలు నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత గ్రామదేవతల ఊరేగింపు గాజుల పేట్ చౌరస్తా మీదుగా పెద్ద బజార్ చౌరస్తా వరకు చేరుకుంది .

02



# ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

02



హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, హైదరాబాద్ - సికింద్రాబాద్ జంట నగరాల ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ చేసినప్పటికీ, అప్పటి ఉమ్మడి పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు.



02

## స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల సేవలు చిరస్మరణీయం

**నగర మేయర్ కూరగాయల ఉమారాణి**

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని నగర మేయర్ కూరగాయల ఉమారాణి అన్నారు. ఆర్య సమాజ్ అనుబంధ సంస్థ షహీద్ రాధాకిషన్ శిక్షా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం కంటేశ్వర్ రైల్వే కమాన్ సమీపంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ రాధాకిషన్ మోదాని బలిదినోత్సవం, వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై షహీద్ రాధాకిషన్ మోదాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# నగరంలో భక్తి శ్రద్ధలతో ఊర పండుగ





అడుగడుగున భక్తులు తొట్టెల కింది నుంచి వెళ్లాలని బారులు తీరారు. పెద్ద బజార్ చౌరస్తా నుంచి రెండు బృందాలుగా విడిపోయి డప్పులుపోతరాజుల విన్యాసాలు??మహిళల పూనకాలతో ఒక బృందం పౌడ లమ్మ నల్ల పోచమ్మ ఆడెల్లి పోచమ్మ పెద్దమ్మ పులి రాట్నం ఆసు తొట్లే లతో ఊరేగింపు దుబ్బ వైపు వెళ్ళింది.

రెండో బృందం సిర్నాపల్లి గడి గోల్ హనుమాన్ చౌరస్తా మీదుగా వినాయక నగర్ ఐదు చేతుల పోచమ్మ మత్తడి పోచమ్మ మహాలక్ష్మమ్మ లతో వెళ్ళింది . గాజుల్ పేట్ వివేకానంద చౌరస్తా వద్ద సరి ని పంపిణీ చేశారు. సరి కోసం భక్తులు ఎగబడ్డారు .

సరిని నాలుగు గుల్లలు గా విభజించారు. ఒక గుల్ల దుబ్బ వైపు రెండవది వినాయక్ నగర్ మూడవది ఎల్లమ్మ గుట్ట నాలుగవది కంఠేశ్వర్ ప్రాంతాలకు సరి చల్లుకుంటూ వెళ్లారు.

ఊర పండుగ సందర్భంగా వాడవాడలా యువకులు ఉత్సాహంగా పాల్గొని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. అమ్మవారి గద్దెల వద్ద పసుపు కుంకుమ కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. యువత కేకలు వేస్తూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మహిళలు పూనకాలతో అమ్మవార్ల ప్రతిరూపమైన తొట్టెల కింద నుంచి వెళ్లేందుకు భక్తులు బారులు తీరారు. పలు వీధి చౌరస్తాలో ప్రజలు మేకలు గొర్రెలను కోళ్లను బలి ఇస్తూ కల్లు సాకలు పోస్తూ కొబ్బరికాయలు కొడుతూ మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకుంటూ గ్రామ దేవతలను నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు.

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రూ.1,800 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసి నిర్మించామని, బోనాల సందర్భంగా రాష్ట్రంలోని ప్రతీ ఆలయ కమిటీకి నిధులు కేటాయించామని చెప్పారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, అనిల్ జాదవ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## తెలంగాణలో ఎంబీబీఎస్ ప్రవేశాలకు కౌంట్‌డౌన్

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన అర్హుల జాబితా ప్రకారం, ఈ ఏడాది 38,021 మంది అభ్యర్థులు వైద్య ప్రవేశాలకు అర్హత సాధించారు. వీరంతా తమ నీట్ ర్యాంకు, రిజర్వేషన్, వెబ్ ఆప్షన్ల ఆధారంగా కౌన్సెలింగ్‌లో పాల్గొని సీట్లను పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం తెలంగాణలో 36 ప్రభుత్వ వైద్య కళాశాలలు, 30 ప్రైవేటు వైద్య కళాశాలలు కలిపి మొత్తం 66 మెడికల్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో కలిపి 9,550 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తక్కువ ఫీజుతో వైద్య విద్యను అభ్యసించే అవకాశం ఉండటంతో ఎక్కువ మంది విద్యార్థులు వాటికే ప్రాధాన్యత ఇస్తున్నారు. మరోవైపు ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్, మేనేజ్‌మెంట్, ఎన్ఆర్ఐ కోటాల కింద సీట్ల భర్తీ చేపట్టనున్నారు. ఆగస్టు 4 నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగ్ ప్రక్రియలో అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, ధ్రువపత్రాల ధృవీకరణ పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం వెబ్ ఆప్షన్లు నమోదు చేసి, సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాల్గొనాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, మార్గదర్శకాలను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇప్పటికే విడుదల చేసింది. వైద్య విద్యలో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది విద్యార్థులకు ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ అత్యంత కీలకంగా మారనుంది. అభ్యర్థులు నిర్ణీత గడువులోపు అన్ని దశలను పూర్తి చేసి, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.



## స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల సేవలు చిరస్మరణీయం

కార్యక్రమానికి ముందు మేయర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ షహీద్ రాధాకిషన్ మోదాని వంటి స్వాతంత్ర్య సమరయోధుల దేశభక్తి, అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భారత జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచిన వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని మేయర్ తెలిపారు. ఈ గీతం ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధి, జాతీయ సమైక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మఠం రేవతి, సిటీ జనరల్ సెక్రటరీ స్వప్న, రాధాకిషన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఆర్య సమాజ్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బోనాల పండుగ...





రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండల కేంద్రంలో బోనాల పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు బోనాలు ఎత్తుకుని గ్రామ వతందర్ వెంకటేశ్వర దేశాయ్ ఇంటి నుండి పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి బోనాలను డప్పువాయిద్యాలు డీజే చెప్పుల్ల మధ్య పోతురాజుల నృత్యాలతో ఘనంగా ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పచ్చగ ఉండాలని డాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వతందార్ వెంకటేశ్వర దేశాయ్, గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్,మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్,బచ్చు రామ్ సెట్, బద్దం సంజీవ్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పత్తి రాము, పత్తి లక్ష్మణ్, కటికె రామ్ రాజ్, బొట్టె గజేందర్, డౌర్ సాయిలు, స్థానిక మండల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా పోచమ్మ పండుగ

- అంటువ్యాధులు సోకకుండా చూడాలి
- ఎద్దోళ్ల బాపురెడ్డి

వేల్పూర్, బతుకమ్మ :వేల్పూర్ మండలంలోని రామన్నపేట గ్రామంలో గల పడకంటి మొటాటి రెడ్డి సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల బాపురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పోచమ్మ పండుగ నిర్వహించారు. సంఘ భవనం గోడకు గల మైసమ్మకు సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంఘ భవనం నుండి డప్పు చప్పుళ్ళతో ఊరేగింపుగా వెళ్లి బస్టాండ్ లో గల పోచమ్మ తల్లి వద్దకు చేరుకున్నారు. పోచమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి గంపలో తీసుకొచ్చిన అన్నం, బెల్లమన్నం ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించి ఎలాంటి అంటూ వ్యాధులు సోకకుండా చూడాలని



మొక్కులు తీర్చుకున్నారు. కొబ్బరికాయలు కొట్టారు. బండారు వేసి కల్లుసాక పోసారు. పుట్నాలు, బెల్లం, ఓమ మిశ్రమంతో కూడిన ప్రసాదాన్ని స్వీకరించారు. పోచమ్మ, గుండేలవ్వ తల్లి కోసం గొర్రెలను తల్లి సన్నిధిలో బలిచ్చారు. పొట్టేలు జడ్త ఇవ్వగానే పులోరియా, పులోరియా అంటూ నినదించారు. ఈ సందర్భంగా పడకంటి మొటాటి రెడ్డి సంఘం అధ్యక్షుడు పెద్దోళ్ల బాపురెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసంలోని ఆదివారం పోచమ్మ పండుగను నిర్వహించుకోవడం పూర్వం నుండి వస్తున్న సంప్రదాయ ఆచారం. గ్రామం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, సమస్త జీవకోటి ప్రాణులన్నీ బాగుండాలని అన్నారు. కార్యక్రమంలో కోళ్లకాడు కంకణాల రవి, మాజీ అధ్యక్షుడు కంకణాల రాజేశ్వర్, పడకంటి బాపురెడ్డి, పంచాక్షర్ రెడ్డి, సాయ రెడ్డి, మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మధు రెడ్డి, చిన్న గంగారెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాసం బోనాల వేడుకల్లో పోచారం భాస్కర్ రెడ్డి

బాన్సువాడ, బతుకమ్మ :ఆషాఢ మాసం సందర్భంగా బాన్సువాడ పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని కోటగల్లి కోటదుర్గమ్మ ఆలయం, సాయికృప నగర్ ఫేజ్ -2 కాలనీలోని మైసమ్మ ఆలయం, రుద్రూర్ గ్రామంలోని పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలు



సుఖశాంతులు, సుభిక్షాలతో ఉండాలని ప్రార్థించారు. బోనాల ఉత్సవాల్లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని



వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసిపోగా, సంప్రదాయ బోనాలు, పోతురాజుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని తీర్మాన్ పల్లి గ్రామంలో స్నేహితుల దినోత్సవ సందర్భంగా బాల్యమిత్రులు ఆత్మీయ సమ్మేళనం చేసుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం అనంతరం అన్ని గ్రామాల్లో పదవ తరగతి ఎస్ఎస్సి బ్యాచులకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఒకరినొకరు అలింగణం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తీర్మాన్ పల్లి గ్రామాబివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవ నిర్వహించగా పలువురు స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా గ్రామంలో కేక్ కట్ చేసి తిరుమనపల్లి గ్రామంలో ఫ్రెండ్షిప్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సాయిబాబా, చెక్ పవర్ సాయిలు, కరోబర్ నరేందర్, కోమటి నరేష్, గంగా మోహన్, సాయిరెడ్డి, పఠాన్ గౌష్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## ఉజ్జయిని మహంకాళి ఆలయంలో టీపీసీసీ అధ్యక్షుడు ప్రత్యేక పూజలు



హైదరాబాద్, బతుకమ్మ :టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. దర్శనం అనంతరం మహంకాళి అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ఆర్టీసీ బస్సు ఢీకొని బాలునికి గాయాలు



రుద్రూర్, బతుకమ్మ :రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్ గ్రామంలో బోధన్ నుండి బాన్సువాడ వెళ్తున్న టీఎస్ యుబి 3300 నంబర్ గల ఆర్టీసీ బస్సు అక్బర్ నగర్ లో 8 ఏళ్ల కల్దుర్కి సిద్దార్థను ఢీ కొనడంతో తీవ్రగాయాల పాలయ్యారు. గాయపడిన బాలుడిని స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పటికీ బస్సు డ్రైవర్ బస్సుని ఆపకపోవడంతో అక్బర్ నగర్ గ్రామ యువకులు మాట్రిక్స్ స్కూల్ వద్ద బస్సును నిలిపివేసి ఆందోళన చేశారు. సంఘటన స్థలానికి రుద్రూర్ ఎస్సై మనోజ్ కుమార్ చేరుకొని ఆందోళనకారులను నచ్చజెప్పి బస్సును రుద్రూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ఘనంగా సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు

బాల్కొండ, బతుకమ్మ :బాల్కొండ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సుదర్శన్ రెడ్డికి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చాట్ల నరేష్, జిల్లా కార్యదర్శి మహమ్మద్ యునుస్, బాల్కొండ ఉపసర్పంచ్ గాండ్ల రాజేందర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు పుప్పాల విద్యాసాగర్, వార్డు సభ్యుడు పిట్ల దయాకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు సయ్యద్ మజారుద్దీన్, మహమ్మద్ అన్వర్, నాయకులు గడ్డం రవి, దొన్పాల్ సాయన్న, జక్క పద్మారావు, బరిగేడి మల్లేష్ యాదవ్, షేక్ ఆరిఫ్ తదితరులు పాల్గొని సుదర్శన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఘనంగా ఊర పండుగ ఉత్సవాలు

### పోతరాజుల విన్యాసాల్లో పాల్గొన్న

### మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగరంలో ఆదివారం నిర్వహించిన ఊర పండుగ అమ్మవార్ల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అమ్మవార్ల ఉత్సవ ఊరేగింపులో సర్వ సమాజ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ పాల్గొని భక్తులతో కలిసి ఉత్సవాల్లో సందడి చేశారు. ఉత్సవాల్లో పోతరాజుల సాంప్రదాయ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీ నారాయణ పోతరాజులతో కలిసి ఊరేగింపులో పాల్గొని వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్, సీనియర్ నాయకులు ఎండల సుధాకర్, రాగి నారాయణ యాదవ్, పటేల్ ప్రసాద్, వడ్ల రవికుమార్, భారతి శ్రీనివాస్, నరేందర్, విజయ్ కుమార్, మల్లేష్ గౌడ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాలు, సంప్రదాయ వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలతో ఇందూరు నగరం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.



## స్నేహితుల దినోత్సవాన విషాదం

### గంగవరం బీచ్‌లో రాకాసి అల బీభత్సం

### ఇద్దరు యువకులు గల్లంతు

వెబ్ డెస్క్, బతుకమ్మ :స్నేహితుల దినోత్సవం సందర్భంగా సరదాగా బీచ్ విహారానికి వెళ్లిన యువకుల బృందంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విశాఖపట్నంలోని గంగవరం బీచ్‌లో ఆదివారం అకస్మాత్తుగా విరుచుకుపడిన భారీ రాకాసి అల ఇద్దరు యువకులను సముద్రంలోకి లాక్కెళ్లింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

సమాచారం ప్రకారం, కొంతమంది స్నేహితులు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా గంగవరం బీచ్‌కు వెళ్లారు. వారు ఒడ్డున నిలబడి సముద్ర అలలను వీక్షిస్తుండగా, ఎలాంటి హెచ్చరిక లేకుండానే ఒక్కసారిగా భారీ అల దూసుకొచ్చింది. ఆ అల తీవ్ర ఉధృతితో యువకులపై విరుచుకుపడి వారిని సముద్రంలోకి ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో మొత్తం ఏడుగురు యువకులు అలల్లో చిక్కుకోగా, వారిలో ఐదుగురు సురక్షితంగా బయటపడగలిగారు. అయితే పెదజాలరిపేటకు చెందిన నీతూ, రాము అనే ఇద్దరు యువకులు సముద్రంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న అధికారులు, స్థానిక మత్స్యకారులు మరియు సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

గంగవరం బీచ్‌లో అప్పుడప్పుడూ ఇలాంటి భారీ రాకాసి అలలు సంభవిస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఆదివారం వచ్చిన అల తీవ్రత ఊహించని విధంగా ఉండటంతో ఈ విషాదం చోటుచేసుకుంది.

స్నేహితుల దినోత్సవాన్ని ఆనందంగా గడపాలని వెళ్లిన యువకుల జీవితాల్లో ఈ ఘటన విషాదాన్ని నింపింది. ఇద్దరు స్నేహితులు సముద్రంలో గల్లంతుకావడంతో వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

## మానవత్వం లేని ఏ మతమైనా సంస్కరించబడాల్సిందే

### పీఆర్ టీయు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :సమాజంలో ఐక్యత, భద్రత, పరస్పర గౌరవం పెంపొందించడమే దేశాభివృద్ధికి, శాంతికి పునాది అని, మానవత్వం, మంచితనం లేని ఏ మతమైనా సంస్కరించబడాల్సిందేనని పి.ఆర్.టి.యు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి అన్నారు. నగరంలోని అర్సపల్లి సమీపంలోని నిజాం ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో “మత సామరస్యం – సోదరభావం – ప్రస్తుత సమాజంలో” అనే అంశంపై ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వమత సమానత్వమే నిజమైన మానవత్వానికి ప్రతీక అని అన్నారు. అన్ని మతాలను గౌరవించడం, పరస్పర ప్రేమ, శాంతి, సయోధ్యతో కలిసి జీవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కుల, మత భేదాలు లేకుండా బాధితులకు ఆహారం, వస్తువులు అందించడం, ఆపదలో ఉన్న పేదలకు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సహాయం చేయడం నిజమైన సోదరభావానికి నిదర్శనమని చెప్పారు. వృద్ధులు, చిన్నారుల పట్ల ఆప్యాయత, ఆదరణ చూపడం కూడా మానవత్వంలో భాగమేనని ఆయన అన్నారు. సమాజంలో మంచి, చెడు అనే రెండే మతాలు ఉన్నాయని పేర్కొంటూ, ఐక్యత, భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, సమాన అవకాశాలు ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి వ్యక్తి కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ దిశగా ఒక అడుగు ముందుకు వేస్తే స్వేచ్ఛ, శాంతి, సౌభ్రాతృత్వంతో కూడిన నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఊర పండుగ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ







నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్న ఊర పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, శాంతిభద్రతలు సక్రమంగా కొనసాగేందుకు చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్వయంగా పరిశీలించారు. పండుగ జరిగే ప్రధాన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలు, రద్దీ కూడళ్లు, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, సున్నిత ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించేలా పోలీసు బృందాలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, అంబులెన్స్ లు, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పండుగ ప్రాంతమంతా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. పికెట్‌లు, మొబైల్ పెట్రోలింగ్ బృందాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసి భక్తులకు భద్రత కల్పించాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ప్రజలు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించాలని, పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఊర పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ అన్ని విధాలుగా విస్తృత బందోబస్తు చర్యలు చేపట్టిందని, ప్రజల సహకారంతో పండుగను విజయవంతంగా నిర్వహించగలమని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ, సీసీఎస్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, గురు నాయుడు, శ్రీశైలం, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, టౌన్ సీఐ శ్రీనివాసరాజ్, సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్‌హెచ్‌ఓ రఘుపతి, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా కీలకం

### డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

జుక్కల్, బతుకమ్మ :ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలకమని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడడంలో ప్రతి బీఎల్ఎ చేసిన కృషి ప్రశంసనీయమని డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జుక్కల్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఎ లు) సేవలను ప్రత్యేకంగా అభినందించారు. అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా బీఎల్ఎ లు అత్యంత బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజలకు అండగా నిలుస్తూ, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బీఎల్ఎ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు



రుద్రూర్, బతుకమ్మ : మాజీ మంత్రివర్యులు ప్రభుత్వ ప్రధాన సలహాదారులు, బోధన్ శాసనసభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం రుద్రూర్ మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుంటూ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వడ్ల నరేష్, పోతురాజు లింగం, బి.శివకుమార్, పార్వతి ప్రవీణ్, తోట సంగయ్య, గాండ్ల శ్రీనివాస్, ఫరఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరపండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక

## నగర మేయర్ కూరగాయల ఉమారాణి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఊర పండగ కేవలం మతపరమైన వేడుక మాత్రమే కాదని, అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సామాజిక ఐక్యతకు ప్రతీక అని నగర మేయర్ కూరగాయల ఉమారాణి పేర్కొన్నారు. నగరంలోని సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఊర పండగ వేడుకలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహక కమిటీ సభ్యులు, ప్రజలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఇలాంటి ఉత్సవాలు ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, సామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. నగర అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని మేయర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతకు మన సంస్కృతి గొప్పతనాన్ని పరిచయం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మఠం రేవతి, సిటీ జనరల్ సెక్రటరీ స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్వ సమాజ్ కమిటీ సభ్యులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంప్రదాయ కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం నిర్వాహకులు నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ కమిటీ సభ్యుల సేవలను అభినందిస్తూ, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు



కలగాలని ఆకాంక్షించారు. భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఊర పండగ వేడుకలు నిజామాబాద్ నగరంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.

# ప్రజలనే కుటుంబంగా భావించి పనిచేసే నాయకుడు సుదర్శన్ రెడ్డి

## డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రజల మధ్య నిరంతరం ఉంటూ, ప్రజలనే కుటుంబంగా భావించి పనిచేసే నాయకుడు సుదర్శన్ రెడ్డి అని, అభివృద్ధినే లక్ష్యంగా చేసుకుని ఆయన ముందుకు సాగుతున్నారని డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ, నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సుదర్శన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షులు, నగర మేయర్ ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సలహాదారుగా సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సాగు, తాగునీటి రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. అల్లీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేశారని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధిలో భాగంగా మెడికల్ కళాశాల ఏర్పాటుకు విశేషంగా పనిచేశారని తెలిపారు. సుదర్శన్ రెడ్డి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు




శరత్, రత్నాకర్ గౌడ్, కోశాధికారి భక్త వాత్సలం, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, మైనార్టీ నాయకులు జావీద్ అక్రం, రాష్ట్ర నాయకులు రామర్తి గోపి, కార్పొరేటర్లు, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఘనంగా 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్'







కామారెడ్డి, బతుకమ్మ :కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం కామారెడ్డి జిల్లాలో ఘనంగా జరిగింది. స్థానిక ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాల వేదికగా నిర్వహించిన ఈ జిల్లా స్థాయి కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా యువతతో ప్రత్యక్షంగా సంభాషించారు. మాదకద్రవ్యాలు, ఇతర దుర్వ్యసనాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.
యువత తమ చదువు, కెరీర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రస్తుత 'జెన్ జీ' తరం తమ లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగాలని ప్రధాని సూచించారు. కుటుంబ పెద్దల అనుభవాలు, సలహాలను గౌరవిస్తూ జీవితంలో పురోగతి సాధించాలని, ఎలాంటి వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన హితవు పలికారు.
అనంతరం దేశవ్యాప్తంగా యువతతో కలిసి మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ అపర్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్కే విద్యాసంస్థల సీఈఓ డాక్టర్ జైపాల్ రెడ్డి, ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చంద్రశేఖర్ అతిథులుగా పాల్గొన్నారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఎన్సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, 'మై భారత్' వాలంటీర్లు మరియు వందలాది మంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# యువకుల అకాల మరణం అత్యంత బాధాకరం

## క్లిష్ట పరిస్థితుల్లో వారికి అండగా నిలవాలి

## నగర మేయర్ కూరగాయల ఉమారాణి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఇటీవల ఎస్ఆర్ఎస్ పీ లో యువకుల అకాల మరణం అత్యంత బాధాకరమని, మూడు కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్నాయని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వారికి అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యతని నగర మేయర్ కూరగాయల ఉమారాణి పేర్కొన్నారు. ఇటీవల ఎస్ఆర్ఎస్ పి బ్యాక్‌వాటర్‌లో చోటు చేసుకున్న విషాద ఘటనలో మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబాలను నగర మేయర్ ఆదివారం పరామర్శించారు. ముస్లిం వర్గానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన మేయర్, బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని మేయర్ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబాలకు ఈ దుఃఖాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా పాల్గొని బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మహమ్మద్ సమీ, అబ్దుల్ వహీద్, అబ్దుల్ ఖయ్యూం, షేక్ జాఫర్, షకీల్, వాహద్ తదితరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పిన మేయర్ కూరగాయల ఉమారాణి మానవీయ స్పందనను స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు అభినందించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని పలువురు పేర్కొన్నారు.

